సాక్షి
నాగర్‌కర్నూల్
గురువారం । 18 । జనవరి । 2024



వైభవంగా గంధోత్సవం

రంగాపూర్ హజ్రత్ నిరంజన్ షావలీ దర్గా గంధోత్సవం వైభవంగా నిర్వహించారు.

వివరాలు 10లో ▸



ఆర్థికాభివృద్ధే లక్ష్యం

ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధించాలని కేంద్ర ప్రభుత్వ అధికారి రఘువంశి అన్నారు.

వివరాలు 12లో ▸

గరిష్టం/కనిష్టం
33.9 /14.2

వాతావరణం

ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రి చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

జాతీయ స్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో ప్రతిభ



కందనూలు: బిహార్ రాష్ట్రంలోని గయా పట్టణంలో నిర్వహించిన 58వ జాతీయస్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో కందనూలు క్రీడాకారుడు మోహిత్ చౌదరి సత్తాచాటాడు. అండర్–18 బాలుర విభాగంలో మోహిత్ చౌదరి ఆరు కిలోమీటర్ల పరుగు పందెంలో ప్రతిభకనబరిచి కాంస్య పతకం సాధించినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విజేందర్‌యాదవ్ బుధవారం తెలిపారు.

టీజేఎస్ రాష్ట్ర సదస్సును విజయవంతం చేద్దాం



కందనూలు: హైదరాబాద్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో ఈ నెల 21న నిర్వహించే తెలంగాణ జన సమితి పార్టీ రాష్ట్ర సదస్సును విజయవంతం చేద్దామని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్యాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలో సదస్సు కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. విభజన హామీల అమలుపై కేంద్ర ప్రభుత్వ వివక్షత అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. విభజన హామీల అమలు, కృష్ణా జలాల్లో రాష్ట్రానికి న్యాయమైన వాటా, ఉద్యోగ విభజన పూర్తి చేసి తెలంగాణ ఉద్యోగులను వెనక్కి పంపించడంతోపాటు పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర సంస్థల ఆస్తులను విభజించాలని, రాష్ట్రంలో అగ్రికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటు, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట్ రైల్వే కోచ్ తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఇంద్రారెడ్డి, టీజేఎస్ నాయకులు వెంకటేష్, రఘునందన్‌రెడ్డి, పులేందర్‌యాదవ్, చందు, సాయి, ఆరిఫ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా బాక్సింగ్ పోటీలకు ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఈ నెల 20, 21 తేదీల్లో జరిగే ఖేలో ఇండియా మహిళా కిక్‌బాక్సింగ్ లీగ్ పోటీలకు జిల్లాకేంద్రానికి చెందిన స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా అధ్యక్షుడు కె.రవికుమార్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కిక్ బాక్సింగ్ లీగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో వర్షిణి, కావ్య, యామిని, సౌమ్య, సాయిస్పజన, నవ్య, సారిక, మనస్వితలు వివిధ వెయిట్ కేటగిరీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. కిక్‌బాక్సింగ్ లీగ్‌కు ఎంపికైన విద్యార్థులను బుధవారం మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ ఆవరణలో పాఠశాల చైర్మన్ బెక్కరి రాంరెడ్డి అభినందించారు. కిక్‌బాక్సింగ్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజేందర్‌రెడ్డి, ఎంఎస్.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

29, 30 తేదీల్లో జాతీయ సదస్సు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఈనెల 29, 30వ తేదీల్లో పీయూ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'డిజిటల్ మార్కెటింగ్ మరియు మానవ వనరులు ఫైనాన్స్ సేవలపై దాని ప్రభావం' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నారు. దీనికి హాజరు కావాల్సిందిగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి పీయూ అధ్యాపకులు ఆహ్వానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అర్జున్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మద్దిమడుగు పీఠాధిపతికి అయోధ్య ఆహ్వానం



అచ్చంపేట రూరల్: అయోధ్యలో ఈ నెల 22న జరగనున్న రామమందిరం ఆలయ ప్రారంభోత్సవానికి నల్లమలలోని మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి పీఠాధిపతి, హనుమాన్ మాలధారణ వ్యవస్థాపకులు జయరాం గురుస్వామికి ఆహ్వానం అందింది. వీహెచ్‌పీ ప్రాంత ధర్మచార్య సంపర్క ప్రముఖ్ వెంకటేశ్వరరావు అయోధ్య నుంచి వచ్చిన ఆహ్వాన పత్రికను బుధవారం జయరాం గురుస్వామికి అందజేశారు. చరిత్రలో నిలిచిపోయే రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆహ్వానం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు జయరాం గురుస్వామి అన్నారు. ఈ నెల 18న రాత్రి హైదరాబాద్ నుంచి అయోధ్యకు బయలుదేరి వెళ్తున్నట్లు చెప్పారు.

ఎమ్మార్సీలకు కంప్యూటర్లు

- ఒక్కో కేంద్రానికి ఆరు చొప్పున పంపిణీ
- విద్యాశాఖ చేపట్టే కార్యక్రమాల నమోదుకు అవకాశం
- కొత్త మండలాలకు మొండిచేయి
- ఇప్పటికే వేధిస్తున్న సిబ్బంది కొరత



అచ్చంపేట ఎమ్మార్సీకి వచ్చిన కంప్యూటర్లు, ప్రింటర్

అచ్చంపేట: విద్యాశాఖ సాంకేతిక వినియోగంపై దృష్టిసారించింది. పథకాల అమలులో పారదర్శకత పెంపొందించేందుకు కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో కొత్త మండలాలు మినహాయించి పాత మండలాల్లోని ఎమ్మార్సీలు, పాఠశాలలు, కేజీబీవీలకు కంప్యూటర్లను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, కమిషనర్ కార్యాలయం నుంచి మంజూరు చేశారు. ఇప్పటికే వివిధ ఎమ్మార్సీలకు ఆయా కంప్యూటర్లు చేరుకున్నాయి. జిల్లాలో 20 మండలాలు ఉండగా.. కొత్త మండలాలైన పదర, చారకొండ, ఊర్కొండ, పెంట్లవెల్లికి మంజూరు కాలేదు. మిగతా మండలాలు అచ్చంపేట, బల్మూర్, లింగాల, ఉప్పునుంతల, అమ్రాబాద్, వంగూరు, నాగర్‌కర్నూల్, తెలకపల్లి, తాడూరు, బిజినేపల్లి, తిమ్మాజిపేట, కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, కోడేరు, కల్వకుర్తి, వెల్దండలకు ఆరు కంప్యూటర్లు చొప్పున చేరుకున్నాయి.

ఇదీ ప్రయోజనం..

గతంలో ఎమ్మార్సీల్లో ఒకటి, రెండు కంప్యూటర్లు మాత్రమే ఉండేవి. ఇప్పుడు ఒక్కో ఎమ్మార్సీకి ఆరు చొప్పున కంప్యూటర్లు, ఒక ప్రింటర్ రావడంతో ప్రయోజనం కలగనుంది. ప్రతి మండలంలో యూడైస్, విద్యార్థుల వివరాలు, మధ్యాహ్న భోజనం అమలు, స్కూల్ యూనిఫాం, ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ, సర్వశిక్ష అభియాన్ ద్వారా చేపడుతున్న వివిధ కార్యక్రమాల వివరాలన్నీ కంప్యూటర్లలో పొందుపర్చనున్నారు. ఎమ్మార్సీలో ఎంఐఎస్ కోఆర్డినేటర్, ఒక డాటా ఎంట్రీ కంప్యూటర్ ఆపరేటర్ పనిచేస్తారు.

పాఠశాలలకు మంజూరు..

జిల్లాలోని పాఠశాలలు, కేజీబీవీలకు సైతం కంప్యూటర్లు అందజేశారు. ప్రతి 30 మంది విద్యార్థులకు ఒకటి చొప్పున పాఠశాల, కేజీబీవీలకు విద్యార్థుల సంఖ్యను బట్టి 5 నుంచి 10 కంప్యూటర్లు మంజూరు చేశారు. అచ్చంపేట బాలికల ఉన్నత పాఠశాల, బిజినేపల్లి మండలం వెల్గొండ, వట్టెం (బాలికల), బిజినేపల్లి (బాలుర), శాయిన్‌పేట, గంగారం, పాలెం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, చారకొండ మండలం జూపల్లి, కల్వకుర్తి మండలం ఎల్లికల్, కోడేరు మండలం నర్సాయపల్లి, కొండ్రావ్‌పల్లి, రాజాపూర్, కొల్లాపూర్ మండలం ఎల్లూరు, ఎన్మన్‌బెట్ల, నార్లాపూర్, కొల్లాపూర్ మోడల్ స్కూల్, సింగోటం (బాలికల), చౌటబెట్ల, కొల్లాపూర్ (బాలికల), కొల్లాపూర్ (జీఎం), నాగర్‌కర్నూల్ మండలం గగ్గలపల్లి, చందుబంట్ల, తెలకపల్లి మండలం గౌరెడ్డిపల్లి, పెద్దకొత్తపల్లి మండలం గంట్రావ్‌పల్లి, చంద్రకల్, దేవునితిర్మలాపూర్, సాతాపూర్, ముష్టిపల్లి, పెంట్లవెల్లి మండలం కొండూరు, తాడూరు మండలం ఐతోల్, మేడిపూర్, తెలకపల్లి మండలం పెద్దపల్లి, ఆలేరు, తిమ్మాజిపేట మండలం చేగుంట, మారేపల్లి, ఉప్పునుంతల మండలం పెనిమిళ్ల, కంసానిపల్లి, వంగూరు మండలం గాజర, వంగూరు బాలికల, వెల్దండ మండలం రాచూరు, పోతేపల్లి, కొట్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు కంప్యూటర్లు మంజూరయ్యాయి. అలాగే అచ్చంపేట మండలం నడింపల్లి కేజీబీవీ, అమ్రాబాద్ మండలం రాయలగండి, బల్మూర్, బిజినేపల్లి, కల్వకుర్తి, కోడేరు, కొల్లాపూర్, లింగాల, నాగర్‌కర్నూల్, తాడూరు, తెలకపల్లి, ఉప్పునుంతల, వంగూరు, వెల్దండ కేజీబీవీలు, కల్వకుర్తి సోషల్ వెల్ఫేర్ బాలుర రెసిడెన్షియల్, తెలకపల్లి సోషల్ వెల్ఫేర్ గురుకుల బాలికల పాఠశాలలకు మంజూరు చేశారు.

ఉచిత ఇంటర్నెట్ సదుపాయం

ప్రతి ఎమ్మార్సీకి ఆరు కంప్యూటర్లు ఇవ్వగా.. ఇందుకు సంబంధించి టేబుల్స్ రాలేదు. అయితే ప్రతి కేంద్రానికి బీఎస్ఎన్ఎల్ ఉచిత ఇంటర్నెనెట్ సౌకర్యం కల్పించారు. విద్యుత్ సౌకర్యం, స్విచ్ బోర్డుల పిట్టింగ్ వంటి పనులు జరుగుతున్నాయి. క్యాబిన్ ఫిట్టింగ్ వంటి పనులు చేస్తేనే సిస్టమ్ సౌకర్యం కల్పిస్తారు. కొత్త ఎమ్మార్సీలకు కంప్యూటర్లు, స్టాఫ్ కొరత కూడా ఉంది.

ఇబ్బంది తొలగినట్లే..



జిల్లాలోని కొత్త మండలాలు పదర, చారకొండ, పెంటవెల్లి, ఊర్కొండ మినహా అన్ని మండలాల ఎమ్మార్సీలకు కొత్త కంప్యూటర్లు వచ్చాయి. గతంలో ఎమ్మార్సీ సెంటర్లలో ఒకటి, రెండు కంప్యూటర్లు ఉంటే.. వాటితోనే అనేక పనులు చేయాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆరు కంప్యూటర్లు ఇవ్వడంతో ఇకపై ఏ ఇబ్బంది ఉండదు. ఎంఐఎస్ కోఆర్డినేటర్, కంప్యూటర్ డాటా ఎంట్రీ ఆపరేటర్, ఎంఈఓ, ఐఈఆర్టీలు, సీఆర్పీలు సైతం వినియోగించుకునే అవకాశం ఉంది.

– గోవిందరాజులు, డీఈఓ.



సింహవాహనంపై.. లక్ష్మీనర్సింహస్వామి

సింగోటం లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయ ఆవరణలో స్వామివారికి సింహవాహన సేవ (ప్రభోత్సవం) నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణాలు, భక్తుల గోవింద నామస్మరణ మధ్య ఉత్సవ విగ్రహాలను సింహవాహనంపై ఉంచి ఆలయ పరిసరాల్లో ఊరేగించారు.

– కొల్లాపూర్ రూరల్

రాజకీయ సమీకరణం

లోక్‌సభ ఎన్నికల వేళ రసవత్తర పరిణామాలు

- బీఆర్ఎస్‌పై కాంగ్రెస్, బీజేపీ ముప్పేట దాడి
- మహబూబ్‌నగర్‌లో అవిశ్వాసంతో కాంగ్రెస్ దూకుడు
- కారు ముఖ్యులకు కమలం గాలం
- రహస్యంగా పలువురు నాయకులతో ఓ సీనియర్ నేత మంతనాలు
- భారీ చేరికలకు రంగం సిద్ధం – అంతర్మథనంలో గులాబీలు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న కొద్దీ ప్రధాన పార్టీలు తమ అభ్యర్థుల గెలుపునకు వ్యూహాలను రచిస్తున్నాయి. ఇప్పటికే ప్రధాన నేతలు, ప్రజాప్రతినిధులు, ఆశావహ అభ్యర్థులు, పార్లమెంట్ నియోజకవర్గస్థాయి నాయకులతో సమావేశాలను నిర్వహిస్తున్న ప్రధాన పార్టీలు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. ఈ క్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని రెండు పార్లమెంట్ నియోజకవర్గ స్థానాల పరిధిలో ఆసక్తికరమైన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి.

బలోపేతంపై పార్టీల దృష్టి..

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ స్థానాలను గెలుచుకునేందుకు ప్రధాన పార్టీలు తమ కేడర్‌ను మరింత బలోపేతం చేసుకోవడంపై దృష్టి పెట్టాయి. మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ నుంచి టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి పోటీలో ఉంటారని ప్రచారం సాగుతోంది. బీజేపీ నుంచి మహబూబ్‌నగర్ స్థానంలో ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, బీజేపీ నేత శాంతకుమార్ పోటీలో ఉన్నారు. బీఆర్ఎస్‌లోనూ ఆశావహుల సంఖ్య భారీగా కన్పిస్తోంది. బీజేపీకి చెందిన ఓ సీనియర్ నేత ఇప్పటికే చాపకింద నీరులా తమపని తాను చేసుకుంటున్నారు. పార్లమెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా చేరికలపై దృష్టి పెట్టారు. బీఆర్ఎస్‌తో సహా ఇతర పార్టీల్లోని ముఖ్య నాయకులు, సర్పంచులతో సంప్రదింపులు జరుపుతున్నారు. అయితే అభ్యర్థిత్వం ఖరారు కాక ముందే సదరు నేత దూకుడు వైఖరి పట్ల ఆ పార్టీలోని ఇతర నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ సారి ఎన్నికల్లో బీసీలకు అవకాశం ఇవ్వాలంటూ అధిష్టానానికి విజ్ఞప్తి చేస్తూ బీసీ వాదాన్ని తెరపైకి తీసుకువస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పాలమూరులో నెలకొంటున్న పరిణామాలతో రాజకీయ పార్టీల మధ్య అప్పుడే ఎన్నికల 'రణం' మొదలైంది.

మున్సిపాలిటీల్లో ముసలం..

అసెంబ్లీ ఎన్నికలు ముగిసి మూడు నెలలు గడవకముందే మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలను ప్రవేశపెట్టేందుకు పార్టీలు, కౌన్సిలర్లు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కోరుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం తదితర అన్ని పార్టీల కౌన్సిలర్లు కలసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో ఈ నెల 27న మహబూబ్‌నగర్ మున్సిపల్ సమావేశ మందిరంలో అవిశ్వాస తీర్మానం ఎన్నిక చేపట్టేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇక్కడ అవిశ్వాసం నెగ్గితే మిగతా చోట్ల సైతం పాలకవర్గాలను దింపేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

పార్టీల మధ్య ఆధిపత్య పోరు..

అసెంబ్లీ ఎన్నికలు ముగిసి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పాటు కొత్త ఎమ్మెల్యేలు కొలువుదీరిన కొన్నాళ్లకే ప్రధాన పార్టీల మధ్య ఆధిపత్య పోరు ఉధృతంగా మారింది. పార్లమెంట్ ఎన్నికల్లో తమదైన సత్తా చాటాలని కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఇప్పటికే ముందస్తు కసరత్తులను ప్రారంభించాయి. దీంతో రాజకీయ వాతావరణం మళ్లీ వేడెక్కుతోంది. ఇదే పంథా వ్యాపారం, ఇతర దందాల్లోనూ కన్పిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని జోగుళాంబ గద్వాల జిల్లాలో కల్లు విక్రయాల్లో పార్టీల మధ్య అప్పుడే యుద్ధ వాతావరణం నెలకొంది. ఇప్పటికే కల్లుదందా నిర్వహిస్తున్న వారిపై దాడులు మొదలుకాగా, కొత్తగా ఏర్పాటు చేసుకుంటున్న వారి కల్లు దుకాణాలను మరో వర్గం ధ్వంసం చేస్తోంది. గద్వాల జిల్లా జమ్మిచేడ్, నది అగ్రహారంలో ఇటీవల ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగి కల్లు సీసాలు, పెట్టెలు, దుకాణాలు ధ్వంసమయ్యాయి. గద్వాల నియోజకవర్గంలో కల్లు దందాలో ఆధిపత్యం కోసం కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ మధ్య వార్ కొనసాగుతోంది.



ఢీ అంటే ఢీ..

జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం వావిలాలలో శివాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం పొట్టేళ్ల పందెం నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 15 పొట్టేళ్లు ఢీ అంటే ఢీగా తలపడ్డాయి. ఈ పోటీలను తిలకించేందుకు జనం ఎగబడ్డారు. – ఎర్రవల్లి చౌరస్తా

– వివరాలు 10లో..

ప్రజల ఆకాంక్ష మేరకు పాలన

- ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

వనపర్తి: యావత్ తెలంగాణ ప్రజలు సంఘటితమై ఉద్యమించడం.. ఎందరో అమరుల త్యాగాల ఫలితంగా ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిందని, అమరవీరులు, రాష్ట్ర ప్రజల ఆకాంక్ష మేరకు పాలన సాగిస్తామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్ పవార్, ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, వాకిటి శ్రీహరితో కలిసి అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. సుమారు రెండున్నర గంటల పాటు జరిగిన సమావేశంలో మిషన్ భగీరథ, రెవెన్యూ, మైనింగ్ శాఖపై సుదీర్ఘంగా చర్చించారు. అధికారులు అందజేసే నివేదికలు, క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉంటున్నాయని.. అందుకు కారణాలు ఏమిటని ప్రశ్నించారు. మిషన్ భగీరథ అధికారులు చూపించిన రిపోర్టులో జిల్లాలో 90 శాతం జనావాసాలకు తాగునీరు అందిస్తున్నట్లు పేర్కొన్నారని.. క్షేత్రస్థాయిలో తాగునీటి సమస్య ఉన్న గ్రామాలు చాలా ఉన్నాయని, నేటికీ పనులు పూర్తికాని గ్రామాలు జిల్లాలో ఉన్నట్లు ప్రజలతో తెలుసుకున్నామని చెప్పారు. సుమారు అరగంట పాటు మిషన్ భగీరథ అధికారులను నిలబెట్టి మంత్రి చర్చించారు. త్వరలో నిర్వహించే సమీక్షలో ఇలాగే ఉంటే ప్రజలతో నేరుగా మాట్లాడిస్తానని చెప్పారు. జిల్లాలోని అసైన్డ్ భూములు, అన్యాక్రాంతమైన భూములపై విచారణ చేయాలని, పరాధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. అనుమతి పొందిన క్వారీలు, మట్టి తవ్విన గుట్టలు, ప్రభుత్వానికి సమకూరిన ఆదాయం వివరాలను సమగ్రంగా అందించాలని కోరారు. అనుమతికి మించి తవ్వకాలు చేస్తే విచారణ చేయాలన్నారు. పదేళ్లలో రాష్ట్రం అన్నిరంగాల్లో ఆశించిన పురోగతి సాధించకపోవడంతో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని.. ప్రజాస్వామ్య పద్ధతిన వారికి సేవలందించాలని అధికారులకు మంత్రి దిశా నిర్దేశం చేశారు. పంచాయతీల్లో కొన్నిరకాల సేవల నిర్వహణ బాధ్యతల్లో ఉన్న ఏజెన్సీలకు బిల్లులు చెల్లించే సమయంలో సర్పంచులు, కార్యదర్శులతో పాటు మహిళా సంఘాల సభ్యుల సంతకాలు తీసుకోవాలని ఆదేశించారు. పదిరోజుల్లో మరోమారు సమీక్ష ఉంటుందని.. సమగ్ర నివేదికలతో అధికారులు హాజరుకావాలన్నారు. జిల్లాల కుదింపుపై విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి దాటవేసే సమాధానం ఇచ్చారు.

23 వేల పైచిలుకు దరఖాస్తులు పరిష్కరించాం : కలెక్టర్

ధరణి పోర్టల్ అమలులోకి వచ్చాక భూ సమస్యల పరిష్కారానికి 26,900 దరఖాస్తులు రాగా.. అందులో 23 వేల పైచిలుకు పరిష్కరించినట్లు కలెక్టర్ తేజస్ పవార్ వెల్లడించారు. పలురకాల కారణాలతో 3,500 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు.

పార్లమెంట్‌కు సై..

- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో బీఆర్ఎస్ నేతలు
- ఎంపీ ఎన్నికల్లో గెలుపునకు వ్యూహాలు
- నిరంతరం ప్రజల్లో ఉండేలా కార్యాచరణ



నాయకులకు దిశానిర్దేశం చేస్తున్న హరీశ్‌రావు

సాక్షి, నాగర్‌కర్నూల్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రధాన పార్టీలన్నీ సిద్ధమయ్యాయి. ఇందులో భాగంగా బీఆర్ఎస్ పార్టీ బుధవారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతలతో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశానికి బీఆర్ఎస్ ముఖ్య నేతలు, మాజీ మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, నాగం జనార్దన్‌రెడ్డి, ఎంపీ రాములు, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, హర్షవర్ధన్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, గుర్క జైపాల్‌యాదవ్ తదితర ముఖ్యనేతలు పాల్గొన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నేతలంతా సమన్వయంతో పనిచేయాలని, పార్టీ అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేసినా.. పార్టీ గెలుపు కోసం అందరూ కృషి చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు సూచించినట్లు సమాచారం. పార్లమెంట్ ఎన్నికల వరకు నిత్యం ప్రజల్లోనే ఉండాలని, పార్టీ చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నిర్ణయించింది.

ప్రజా సమస్యలపై నినదించేలా..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కావస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ సాధ్యం కాని హామీలు ఇచ్చిందని, వాటిని అమలు చేయలేకపోతే ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ ప్రజల తరపున నిలబడి పోరాటం చేయాలని యోచిస్తోంది. ప్రధానంగా ఆరు గ్యారంటీలను అమలుచేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేయనుంది. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజల్లో ఉండి క్షేత్రస్థాయిలో పోరాటంలో నిలవాలని ఆ పార్టీ భావిస్తోంది. ఇందులో భాగంగా నిత్యం కార్యక్రమాలతో ప్రజల్లోనే ఉండేలా, వారి సమస్యలపై పోరాడుతూ బాసటగా నిలిచేలా సమాయత్తం చేస్తోంది.

అభ్యర్థుల ఎంపికపై కసరత్తు..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గాలు ఉండగా, బీఆర్ఎస్‌పార్టీ తమ అభ్యర్థుల ఎంపికపై ఆచితూచి వ్యవహరిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన వారికి అవకాశం కల్పిస్తారని ప్రచారం సాగుతుండగా, ఈ విషయంపై సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకుంటారని చెబుతున్నారు. మహబూబ్‌నగర్ స్థానం జనరల్‌కు, నాగర్‌కర్నూల్ స్థానం ఎస్సీలకు రిజర్వ్ కాగా రెండూ స్థానాల్లోనూ బీఆర్ఎస్‌లో ఆశావహుల జాబితా భారీగా కన్పిస్తోంది. పార్టీ అధిష్టానం అభ్యర్థిగా ఎవరిని ప్రకటించినా నేతలంతా సమన్వయంతో పనిచేసి పార్టీని గెలిపిస్తామని బీఆర్ఎస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

డివైడర్‌ను ఢీకొని విద్యార్థి మృతి


వరుణ్ (ఫైల్)

పెబ్బేరు రూరల్: బైక్ అదుపు డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో విద్యార్థి మృతి చెందాడు. ఏఎస్‌ఐ జయరాములు తెలిపిన వివరాల ప్రకారం.. పెబ్బేర్ పట్టణానికి చెందిన వరుణ్ (18), మరో ఇద్దరు తన మిత్రులతో కలిసి మంగళవారం బైక్ వెళ్తుండగా జాతీయ రహదారి కొత్తకోట బైపాస్ వద్ద డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో వరుణ్ తలకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. తండ్రి గోవిందు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. మరో ఇద్దరికి గాయాలతో చికిత్స పొందుతున్నారు. వరుణ్ తెలంగాణ ఆదర్శ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. పట్టణానికి చెందిన పద్మ, గోవిందు దంపతులకు ఏకైక కుమారుడు కావడంతో తల్లిదండ్రుల రోదనలు పలువురిని కదిలించాయి.

రెండు బైకులు ఢీకొని ఒకరు..


కొండయ్య (ఫైల్)

మక్తల్: రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని బొందల్‌కుంట స్టేజీ సమీపంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మరికల్‌కు చెందిన కొండయ్య (42) మక్తల్‌కు పని నిమిత్తం వచ్చాడు. తిరుగు ప్రయాణంలో బొందల్‌కుంట స్టేజీ వద్ద రాగానే, ఉప్పర్‌పల్లికి చెందిన రాకేష్‌రెడ్డి మక్తల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న సమయంలో రెండు బైకులు ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన కొండయ్యను మెరుగైన చికిత్స కోసం తరలిస్తున్న సమయంలో మృతి చెందాడు. రాకేష్‌రెడ్డికి స్వల్పగాయాలయ్యాయి. కొండయ్యకు భార్య, పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ పారిశుద్ధ్య కార్మికుడు మృతి


కృష్ణయ్య (ఫైల్)

మదనాపురం: విద్యుదాఘాతానికి గురై చికిత్స పొందుతున్న పారిశుద్ధ్య కార్మికుడు బుధవారం మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి కథనం మేరకు.. మండలంలోని రామన్‌పాడుకు చెందిన కృష్ణయ్య (50) గ్రామంలో పారిశుద్ధ్య కార్మికుడిగా విధులు నిర్వర్తించేవాడు. ఈ నెల 12న వీధి దీపాలు అమర్చేందుకు స్తంభంపైకి ఎక్కి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. కృష్ణయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పారిశుద్ధ్య కార్మికుడితో విద్యుత్ పనులు చేయించడంతోనే ప్రమాదం చోటు చేసుకుందని.. బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ మరొకరు..

ఎర్రవల్లిచౌరస్తా: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన కోదండాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కృష్ణదేవా కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కోదండాపురం చెందిన బోయ శ్రీరాముడు (34) మంగళవారం ఉదయం పని నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్తుండగా కోదండాపురం స్టేజీలో జాతీయ రహదారిని రోడ్డు దాటుతుండగా కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు అతివేగంతో వచ్చి ఒక్కసారిగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలు కావడంతో గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ సంతోష్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గొర్రెల మందపై చిరుత దాడి

ఖిల్లాఘనపురం: వ్యవసాయ పొలంలో ఉన్న గొర్రెపై చిరుత పులి దాడి చేసిన సంఘటన మండలంలోని పర్వతాపురం శివారులో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్ల సాదయ్య కుమారుడు సురేష్ బుధవారం గ్రామ శివారులోని మీసాల బాలప్ప వ్యవసాయ పొలంలో గొర్రెలు మేపుతున్నాడు. సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో చిరుతపులి గొర్రెల మందపై దాడి చేసి ఓ గొర్రెను ఎత్తుకెళ్లింది. గమనించిన కాపరి అక్కడే ఉన్న కొందరు రైతులతో కలిసి చెట్టు ఎక్కి.. కేకలు వేయడంతో చిరుత గొర్రెను అక్కడే వదిలేసి పారిపోయింది. అటవీ శాఖ అధికారులు వెంటనే చిరుత పులిని పట్టుకుని తీసుకెళ్లాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా ఫారెస్టు అధికారి నవీన్‌రెడ్డిని వివరణ కోరగా గొర్రెను చిరుతపులి ఎత్తుకెళ్లి చంపింది వాస్తవమేనన్నారు. కాపరికి ప్రభుత్వం నుంచి పరిహారం అందిస్తామని, చిరుతను పట్టుకునేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

బ్రిడ్జి మరమ్మతు ప్రారంభం


బ్రిడ్జిపై మరమ్మతు పనులు పర్యవేక్షిస్తున్న అధికారులు

- అనుమతి లేకున్నా నడుచుకుంటూ వెళ్తున్న ప్రజలు
- వాహనాలు వెళ్లకుండా పోలీసుల బందోబస్తు

కృష్ణా: మండల సరిహద్దులోని కృష్ణానదిపై బ్రిడ్జి మరమ్మతు పనులను బుధవారం ఉదయం ప్రారంభించారు. ఇటు వైపు టైరోడ్డులోనే అటు వైపు వాహనాలు వెళ్లకుండగా ఎస్‌ఐ విజయభాస్కర్ నిలిపివేశారు. కాగా అక్కడి నుంచి చెక్‌పోస్టు వరకు కిలో మీటర్ దూరం ఉంటుంది. ఆ ప్రాంతంలోని రైతులు తమ పొలాలకు ద్విచక్రవాహనాలు వెళ్లకుండగా పోలీసులు నిలిపి వేయడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యపై కాంగ్రెస్ నాయకులు ఆనంద్‌గౌడ్, కృష్ణమూర్తి, శివరాంరెడ్డి మక్తల్ సీఐ రాంలాల్‌కు రైతుల ఇబ్బందులను అర్థం చేసుకుని వారిని పొలాలకు వెళ్లేందుకు అవకాశం కల్పించాలని కోరారు. అదేవిధంగా రాయచూర్‌కు వెళ్లే ప్రయాణికులు కాలినడకన దేవసూగూర్ చేరుకుని అక్కడి నుంచి రాయచూర్‌కు వెళ్తున్నారు. దీంతో మహిళలు, చిన్నరాలు, వృద్ధులు ఇబ్బందులకు గురయ్యారు.

> **రైలు సౌకర్యం**
> కృష్ణా నుంచి రాయచూర్ పట్టణానికి రైలులో వెళ్లేందుకు అవకాశం ఉంది. ఉదయం రాయచూర్‌కు వెళ్లేందుకు రెండు రైళ్లు ఉన్నాయని వాటిని ప్రయాణికులు ఉపయోగించుకోవచ్చని అధికారులు తెలిపారు.

200 మంది కార్మికులకు ఇబ్బంది

కృష్ణా, హిందుపూర్, కున్సి, గుర్జాల్, గుడెబల్లూర్, ముడుమాల్ చెందిన దాదాపు 200 మంది కార్మికులు శక్తినగర్‌లోని పలు కంపెనీలలో విధులు నిర్వహిస్తున్నారు. వీరు ప్రతిరోజు ఉదయం వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చేవారు. ఇప్పుడు ఏకంగా 45 రోజులు పాటు బ్రిడ్జిపై ప్రయాణాలు నిలిపి వేయడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొందరు దేవసూగూరులో అద్దె ఇంట్లో ఉండి విధులు నిర్వహిస్తే, మరికొందరు కాలినడకన వెళ్తున్నారు. అలాగే విద్యార్థులు కూడ అక్కడి కళాశాలకు, పాఠశాలలకు వెళ్లే వారు చాలా మంది బ్రిడిపై నడుచుకుంటూ వెళ్లారు.


బ్రిడ్జిపై వాహనాలు వెళ్లకుండా పోలీసుల బందోబస్తు


కాలినడక వెళ్తున్న ప్రయాణికులు

బెట్టింగ్ మాయలోపడి.. వ్యక్తి బలవన్మరణం


తిరుపతయ్య (ఫైల్)

జడ్చర్ల టౌన్: ఆన్‌లైన్ బెట్టింగ్ మాయలోపడి ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన జడ్చర్ల మండలం చిన్న ఆదిరాలలో బుధవారం వెలుగు చూసింది. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. మిడ్జిల్ మండలం మసిగుండ్లపల్లికి చెందిన తిరుపతయ్య (36) భార్య లావణ్య, కుమారుడు, కుమార్తెతో కలిసి బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే ఉంటున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్ మాయలో పడి ఉన్న ఐదెకరాల పొలం, ఓ కారు విక్రయించాడు. సోదరుడు ఇచ్చిన కారు నడుపుకొంటూ జీవనం సాగించేవాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లో ఆ కారును సైతం కుదువపెట్టాడు. సంక్రాంతి పండుగకు భార్య, పిల్లలను అత్తగారి ఊరైన కేశంపేట మండలం దత్తాయపల్లికి పంపించి అతడు స్వగ్రామానికి వచ్చాడు. ఈ నెల 12న కుమార్తె జన్మదినం ఉండటంతో తెలిసిన వారి వద్ద బుల్లెట్ వాహనం తీసుకొని దత్తాయపల్లికి వెళ్లాడు. జన్మదిన వేడుకలు ముగిశాక బుల్లెట్‌ను కేశంపేటలోనే రూ.22 వేలకు కుదువపెట్టి ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పాల్గొని ఆ డబ్బులు పోగొట్టుకున్నాడు. మిత్రుడి సాయంతో ఈ నెల 13న సాయంత్రం 4 గంటలకు మసిగుండ్లపల్లికి వచ్చి గ్రామ సమీపంలోని గుట్ట వద్ద ఓ చెట్టుకు ఉరేసుకున్నాడు. ఇంటికి చేరుకోకపోవడంతో భార్య, కుటుంబ సభ్యులు వెదకడం ప్రారంభించి సమీప గ్రామ సర్పంచ్‌లు, తెలిసిన వారికి సమాచారం ఇచ్చారు. మిడ్జిల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బుధవారం ఉదయం పత్తి చేనులో కూలీకి వెళ్తున్న వారు చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని చూసి సర్పంచ్‌కు సమాచారం ఇచ్చారు. సర్పంచ్ పోలీసులు, కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతుండటంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్‌ఐ నాగరాజు పంచనామా నిర్వహించి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో.. తండ్రిని హత్యమార్చిన తనయుడు


వీరయ్య (ఫైల్)

కల్వకుర్తి రూరల్: మద్యం మత్తులో తండ్రిని తనయుడు హత్య చేసిన ఘటన మండలంలోని పంజుగులలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, ఎస్‌ఐ రమేష్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన వీరయ్య (65) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇతని కుమారుడు వెంకటయ్య అంగ వైకల్యంతో జన్మించాడు. తండ్రీ కొడుకుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. మంగళవారం రాత్రి మద్యం తాగొచ్చిన వెంకటయ్య ఇంట్లో పడుకున్న తండ్రిని కత్తితో కడుపు, ఛాతిపై పొడిచాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెంటనే వీరయ్యను కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. వీరయ్య భార్య పోచమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వెంకటయ్యను బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.

17 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

అచ్చంపేట రూరల్: అక్రమంగా ఓ వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తుండగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. అచ్చంపేట నుంచి లింగాల వైపు ఓ వాహనంలో 17 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా ఎన్‌ఫోర్స్‌మెంట్ పక్కా సమాచారంతో దాడులు చేశారు. వాహనంలోని బియ్యాన్ని ఓ రైస్‌మిల్లుకు పంపించి వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనంలో ఉన్న వ్యక్తి రామస్వామిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రవికుమార్ ఫిర్యాదు చేశారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

కేసు నమోదు

మహమ్మదాబాద్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన వ్యక్తి అత్యాచార యత్నానికి పాల్పడినట్లు బాలిక తల్లి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసింది. ఈ నెల 12న పొలానికి వెళ్లి వస్తున్న తన కుమార్తెపై గ్రామానికి చెందిన జోగు నర్సింహులు అత్యాచారం చేయడానికి యత్నించాడని.. ఈ విషయాన్ని అడిగేందుకు వెళ్తే అసభ్యకరంగా మాట్లాడాడని ఫిర్యాదులో పేర్కొంది. ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఆత్మకూర్: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు చేసి 6 ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని పోలీస్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు మండలంలోని తిప్పుడంపల్లి ఊకచెట్టు వాగు వద్ద అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. అయితే మధ్యాహ్నం 12 గంటలకు ఆరు ట్రాక్టర్లకు అనుమతులు ఉన్నాయని తహసీల్దార్ రాజు సమాచారం ఇవ్వడంతో ట్రాక్టర్లను వదిలిపెట్టినట్లు వివరించారు.

అట్టహాసంగా గిరక బండి, పొట్టేళ్ల పందెం పోటీలు


వివిధ ప్రాంతాల నుంచి పోటీకి వచ్చిన పొట్టేళ్లు

- వైభవంగా శివాంజనేయస్వామి ఉత్సవాలు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని వావిలాలలో శివాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగాయి. ఉత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి డాక్టర్ దీక్షిత్ సుబ్రమణ్యం చేత స్త్రీ కంఠ గాణలహరి వైభవంగా నిర్వహించారు. బుధవారం అంతర్రాష్ట్ర కిలారి గిరక బండి, పొట్టేళ్ల పందెం పోటీలు అట్టహాసంగా ప్రారంభించారు. పొట్టేళ్ల పందెం పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన 15 పొట్టేళ్ల వచ్చాయి. హోరా హోరీగా సాగిన పొట్టేళ్ల తల పొట్లాట పందెంలో ఆంధ్రప్రదేశ్‌లోని దామగట్లకు చెందిన భార్గవ్ పొట్టేలు మొదటి బహుమతి రూ. 20వేలు, అలంపూర్ మండలంలోని గొందిమర్లకు చెందిన ప్రభాస్ పొట్టేలు రెండవ బహుమతి రూ. 15వేలు, ఆంధ్రప్రదేశ్‌లోని పెద్ద కడుబూరుకు చెందిన సిద్దార్థ పొట్టేలు మూడవ బహుమతి రూ.10వేలు, అయిజ మండలంలోని భూంపురం చెందిన రామ పొట్టేలు నాల్గవ బహుమతి రూ.5వేల నగదును కైవసం చేసుకున్నాయి. అలాగే హోరాహోరీగా సాగిన కిలారి బండ్ల గిరక బల ప్రదర్శన పోటీలకు వివిధ రాష్ట్రాలకు చెందిన 9జతల కిలారి జాతి వృషభాలు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో కర్నూల్ జిల్లాలోని కైరుపూలకు చెందిన బంగ్రోత్ వీరేష్ యాదవ్‌కు చెందిన వృషభాలు 3,143 ఫీట్లు లాగి మొదటి బహుమతి రూ.30వేలు, కర్నూల్ జిల్లాలోని వలగొండకు చెందిన ఈరన్న వృషభాలు 2,796.6 ఫీట్లు లాగి రెండవ బహుమతి రూ.25వేలు, కర్నూల్ జిల్లాలోని గుదికల్‌కు చెందిన హరికృష్ణ వృషభాలు 2,644.5 ఫీట్లు లాగి రూ.20వేలు, గట్టు మండలంలోని సల్కాపురం చెందిన విజేంద్ర వృషభాలు 2,570 ఫీట్లు లాగి నాల్గవ బహుమతి రూ.15వేలు, కర్నూల్ జిల్లాలోని గుమ్మరాళ్లకు చెందిన అల్లబకాష్ వృషభాలు 2,243 ఫీట్లు లాగి ఐదవ బహుమతి రూ. 10వేల నగదును కైవసం చేసుకున్నాయి. పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. ఆయా పోటీల్లో గెలుపొందిన వారికి ఆలయ కమిటీ సభ్యులు నగదు బహుమతులను అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త బీవీరెడ్డి కుటుంబ సభ్యులు శివాంజనేయస్వామిని దర్శించుకుని ఆలయ అభివృద్ధికి, రెండు అడుగుల ఆంజనేయస్వామి పంచలోహ విగ్రహం ఏర్పాటు కోసం రూ. 6.50లక్షలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రంగారెడ్డి, రామయ్య, విజయ భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మాణిక్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కిలారి బండ్ల గిరకలో బల ప్రదర్శన చూపుతున్న వృషభాలు

వైభవోపేతంగా గంధోత్సవం


రంగాపూర్ దర్గాలో మతపెద్దలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, మాజీ ఎంపీ మల్లురవి

అచ్చంపేట/ అమ్రాబాద్/ మన్ననూర్/ ఉప్పునుంతల: రంగాపూర్ హజ్రత్ నిరంజన్ షావలీ దర్గా గంధోత్సవం వైభవంగా నిర్వహించారు. స్థానిక జామే మసీదు కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి 9.30 గంటలకు గంధోత్సవం ప్రారంభమవగా.. ఎమ్మెల్యే వంశీకృష్ణ పాల్గొని ప్రార్థనలు చేశారు. అచ్చంపేటకు చెందిన పటేల్ వంశీయులైన నారాయణ ప్రసాద్ చిన్న కుమారుడు మన్నుప్రసాద్ 20 ఏళ్లుగా గంధం వేడుకలు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. మారుతీనగర్‌లోని మహెల్లి ఇంటి నుంచి ప్రత్యేక కారుపై అలంకరించిన పంకాను మన్నుప్రసాద్ ఇంటికి చేరిన తర్వాత శేషు పటేల్ ఇంట్లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం గంధోత్సవం బయలుదేరింది. విద్యుత్ దీపాలంకరణతో ప్రత్యేకంగా తయారు చేసిన డీసీఎం వ్యాన్‌లో గంధాన్ని ఉంచి పట్టణంలో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ప్రతిఏటా జనవరి 17న రాత్రి అచ్చంపేట నుంచి బయలుదేరిన గంధం అర్ధరాత్రి దాటిన తర్వాత రంగాపూర్ దర్గా చేరుకోగానే ఉర్సు ప్రారంభమవుతుంది. జిల్లా నలుమూలల నుంచే కాక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు గంధోత్సవం తిలకించేందుకు రంగాపూర్ చేరుకున్నారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ ఉర్సుకు ప్రజలు తరలివచ్చారు. అచ్చంపేటతోపాటు మన్ననూర్, అమ్రాబాద్, బల్మూర్, బొమ్మన్‌పల్లి, నాగర్‌కర్నూల్, లింగాల, ఉప్పునుంతల, తెలకపల్లి, కొల్లాపూర్, వనపర్తి, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి గంధాన్ని ఊరేగింపుగా తీసుకువస్తారు. అమ్రాబాద్, బొమ్మన్‌పల్లి నుంచి వచ్చే గంధం గుర్రంపై రావడం ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.


జామె మసీద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మతపెద్దలు

- అమ్రాబాద్ నుంచి ఉర్సు రంగాపూర్‌కు నిర్వహించిన గంధోత్సవంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ, మాజీ ఎంపీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి పాల్గొన్నారు. తగ్బీర్‌లను ఎత్తుకొని గంధోత్సవం వెంట నడిచారు. మన్ననూర్ మసీదు కమిటీ ఆధ్వర్యంలోనూ గంధోత్సవం కొనసాగింది. దర్గాలో సదరన్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ నసీర్ సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.
- ఉప్పునుంతలలోని మహబూబ్‌సాని దర్గా వద్ద గంధోత్సవానికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అక్కడి నుంచి గంధాన్ని అలంకరించిన డీసీఎంలో ఊరేగిస్తూ రంగాపూర్‌కు తీసుకెళ్లారు.


అచ్చంపేటలో మన్నుప్రసాద్ ఇంటి నుంచి బయలుదేరిన గంధోత్సవం

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కోడేరు: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం కోడేరులో నిర్వహించిన అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలను ప్రారంభించి మాట్లాడారు. రైతులు ప్రతి సంక్రాంతి పండుగ రోజు ఇలాంటి కార్యక్రమాలు చేయడంతో నూతనోత్సాహం ఉంటుందన్నారు. వృషభరాజాలను బండలాగుడు పోటీల్లో హింసిచకుండా ప్రేమపూర్వకంగా నిర్వహించుకోవాలని సూచించారు. రైతులు వ్యవసాయ, పాడి పరిశ్రమ రంగంలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

బహుమతుల అందజేత

బండలాగుడు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను మాజీ ఎంపీపీ రాంమోహన్‌రావు, మండల కోఆప్షన్ మెంబర్ అబ్దుల్ ఖరీం అందజేశారు. పోటీల్లో 8 జతల ఎద్దులు పాల్గొనగా.. నాగర్‌కర్నూల్ జిల్లా యాదిరెడ్డిపల్లి అఖిలేష్‌రెడ్డి ఎద్దులు 3,250 ఫీట్లు లాగి ప్రథమ బహుమతి రూ.80 వేలు అందుకున్నారు. వనపర్తి జిల్లా కొత్తకోట గురునాథం ఎద్దులు 2968 ఫీట్లు లాగి రూ.60 వేలు, గద్వాల జిల్లా కేటీదొడ్డి తిరుపతయ్య ఎద్దులు 2,774 ఫీట్లు లాగి రూ.50 వేలు, గద్వాల వినయ్‌రాయుడు ఎద్దులు 2,431 ఫీట్లు లాగి రూ.40 వేలు, కంచెపాడు సుధాకర్‌రెడ్డి ఎద్దులు రూ.30 వేలు, పెద్దదగడ గోపాలకృష్ణ ఎద్దులు రూ.20 వేలు, దేవబండ భాస్కర్‌గౌడ్ ఎద్దులు రూ.15 వేలు, రేమద్దుల పెద్ద బాలయ్య ఎద్దులు రూ.10 వేలతో పాటు జ్ఞాపికలు అందుకున్నారు. బహుమతులు ప్రదానం చేసిన రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సురేష్, రామకృష్ణ తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ మహేష్‌రెడ్డి, కుర్మయ్య, జగదీశ్వర్‌రావు, దానయ్య, రాజు, సురేష్, బాబు, ఇమ్రాన్, రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శరత్, నాగేష్, నాగమల్లి, బాలపీరు, బాలరాజుయాదవ్, నిరంజన్, సి.బాలపీరు, తిరుపతయ్య, చామంతి రాజు తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలికంగా ఎముకల ఫ్యాక్టరీ మూసివేత



ఎముకల ఫ్యాక్టరీ ప్రతినిధులు, ఆందోళనకారులతో చర్చిస్తున్న సీఐ రామకృష్ణ

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లాలో చర్చనీయాంశంగా మారిన భూత్పూర్, మహబూబ్‌నగర్ రూరల్ మండలాల పరిధిలోని జానంపేట, ఇప్పలపల్లి, తాటికొండ, గాజులపేట గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన ఎముకల ఫ్యాక్టరీని తాత్కాలిక మూసివేతకు కంపెనీ ప్రతినిధులు అంగీకరించారు. ఎముకల ఫ్యాక్టరీ నుంచి వస్తున్న దుర్వాసన భరించలేక ఆయా గ్రామాల యువత మంగళవారం పరిశ్రమ ఎదుట ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. బుధవారం కూడా ఆందోళన చేయడానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఫ్యాక్టరీ వద్దకు చేరుకున్న విషయం తెలుసుకున్న భూత్పూర్ సీఐ రామకృష్ణ ఆందోళనకారులు, ఫ్యాక్టరీ ప్రతినిధులను పిలిపించి ఇరువర్గాలతో చర్చలు జరిపారు. చేస్తున్న ఆందోళనను విరమింపజేసేందుకు ఫ్యాక్టరీని తాత్కాలికంగా వారం రోజుల పాటు మూసివేస్తామని, ఆ తర్వాత జరిగే బోర్డు సమావేశంలో తదుపరి నిర్ణయం తీసుకుంటామని ఫ్యాక్టరీ ప్రతినిధులు తెలిపారు. ఫ్యాక్టరీ నడుపుకోవడానికి అవసరమైన అన్ని అనుమతులు తమకు ఉన్నాయని, అందువల్ల బోర్డు నిర్ణయమే తుది అని వారు వెల్లడించారు. కాగా పశువుల కళేబరాలను తీసుకొచ్చి వాటి ద్వారా పరిశ్రమ యాజమాన్యం ఆయిల్ ఉత్పత్తి చేస్తున్నారని, కంపెనీ నుంచి వెలువడుతున్న దుర్వాసనతో చిన్నారులు, వృద్ధులు శ్వాసకోస వ్యాధుల బారిన పడి చనిపోతున్నారని ప్రజలు ఆరోపించారు. తాత్కాలికంగా కాకుండా పూర్తిగా ఎముకల ఫ్యాక్టరీని మూసివేస్తేనే తమకు న్యాయం జరుగుతుందని వారు అభిప్రాయపడ్డారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

CHANGE OF NAME

■ I, AYESHA SIDDIQA, R/o H.No.1-68, Kothlabad, Mahabubnagar Dist.T.S., hereby state that I have changed my name from BALAMANI D/o KONDANNA (old name) to AYESHA SIDDIQA. (new name). [J-753572]

WANTED

■ హరేకృష్ణ హోలేకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు నర్సస్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి- భోజనం. జీ : 18K. Ph: 9640258899, 9640468899 [H-793680]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి, మేనేజర్

చరిత్రాత్మకంగా చైతన్యమూర్తి

ఆకాశమంతటి వ్యక్తిత్వంతో దేశ గతిని మార్చిన బాబా సాహెబ్ అంబేడ్కర్: ఏపీ సీఎం జగన్

పెత్తందారీ భావాలపై తిరుగుబాటుకు స్ఫూర్తినిచ్చేలా 'సామాజిక న్యాయ మహా శిల్పం'

అంబరాన్ని తాకేలా విజయవాడలో 206 అడుగులతో అతి పెద్ద విగ్రహం

19న స్వరాజ్య మైదానంలో విగ్రహావిష్కరణకు అంతా స్వచ్ఛందంగా తరలి రావాలని ఏపీ సీఎం సందేశం

సాక్షి, అమరావతి: అంబరాన్ని తాకేలా విజయవాడలో మనం ఏర్పాటు చేసుకుంటున్న రాజ్యాంగ నిర్మాత, బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోవటమే కాకుండా శతాబ్దాల పాటు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. అది 'స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్' (సామాజిక న్యాయ మహా శిల్పం) అని అభివర్ణించారు. మన సమాజ గతిని సమతా భావాల వైపు మరల్చటానికి, సంఘ సంస్కరణలకు, పెత్తందారీ భావాలపై తిరుగుబాటుకు, రాజ్యాధికారంలో పేదల స్థానాన్ని సుస్థిరం చేసేందుకు ఆ మహా శిల్పం నిరంతరం స్ఫూర్తి ఇస్తుందని విశ్వసిస్తున్నట్లు చెప్పారు. విజయవాడలోని చారిత్రక స్వరాజ్య మైదానంలో ఈ నెల 19వ తేదీన ఆవిష్కరించనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే అతి పెద్దదన్నారు. అంబేడ్కర్ మహా శిల్పాన్ని ఆవిష్కరించనున్న సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ బుధవారం రాష్ట్ర ప్రజలకు ఈమేరకు సందేశం ఇచ్చారు. 'అది 81 అడుగుల వేదికపై ఏర్పాటు చేసిన 125 అడుగుల మహా శిల్పం. అంటే.. 206 అడుగుల ఎత్తైన విగ్రహం. ఆ మహానుభావుడి ఆకాశమంతటి వ్యక్తిత్వం, దేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ, మహిళా చరిత్రను మార్చేలా దాదాపు 100 ఏళ్ల క్రితమే ఆయన వ్యక్తం చేసిన భావాలు కలకాలం మన దేశాన్ని ప్రభావితం చేస్తూనే ఉంటాయి. ఆయన భావాల పట్ల అచంచల విశ్వాసంతో, బాధ్యతతో వాటిని మన నవరత్నాల్లో అనుసరిస్తున్న ప్రభుత్వంగా ఏర్పాటు చేసిన ఈ విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా 19వ తేదీన అందరూ స్వచ్ఛందంగా తరలి రావాలని కోరుతున్నా' అని తన సందేశంలో సీఎం జగన్ పేర్కొన్నారు.

దేశానికే తలమానికం



- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ట్వీట్

సాక్షి, అమరావతి: విజయవాడలో మనందరి ప్రభుత్వం ఏర్పాటు చేసిన 206 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహాశిల్పం రాష్ట్రానికే కాదు.. దేశానికే తలమానికం అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. చరిత్రను తిరగరాసేలా మరెందరికో వందల ఏళ్ల పాటు 'స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్' స్ఫూర్తినిస్తుందన్నారు. ఈ నెల 19వతేదీన విజయవాడలో బాబా సాహెబ్ అంబేడ్కర్ మహా శిల్పం విగ్రహావిష్కరణకు అందరూ స్వచ్ఛందంగా తరలి రావాలని కోరుతూ సీఎం జగన్ బుధవారం ట్వీట్ చేశారు.

నిరంతరం కాపాడే మహాశక్తి

- ఆయన.. అణగారిన వర్గాలకు చదువులు చేరువ చేసిన మహనీయుడు!
- అంటరానితనం, ఆధిపత్య భావజాలంపై తిరుగుబాటు చేసిన మహానుభావుడు!
- సమ సమాజ భావాలకు నిలువెత్తు రూపం!
- రాజ్యాంగం, రాజ్యాంగ హక్కుల ద్వారా నిరంతరం మనల్ని కాపాడే ఓ మహాశక్తి!
- ప్రతి వాడలో ఉన్న ఆయన విగ్రహం అణగారిన వర్గాలకు నిరంతరం ధైర్యాన్ని, అండని ప్రసాదించే ఓ మహా స్ఫూర్తి!
- దళితులతో పాటు కులాలు, మతాలకు అతీతంగా పేదలందరి జీవితాల్లో ఈ 77 ఏళ్లలో వచ్చిన అనేక మార్పులకు మూలం డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ భావాలే!

ఇంకా సెట్ కాలేదు!

▶ మొదటి పేజీ తరువాయి

ఎంసెట్ సహా ఇతర ప్రవేశ పరీక్షలు కూడా ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోందని విద్యావేత్తలు చెప్తున్నారు.

హడావుడిగా జరిగితే ఇబ్బందులే..

సాధారణంగా ఉమ్మడి ప్రవేశపరీక్షల ప్రక్రియ ఏటా నవంబర్ నుంచే మొదలవుతుంది. వర్సిటీల వీసీలతో ఉన్నత విద్యా మండలి సమావేశం ఏర్పాటు చేసి.. సెట్స్‌కు కన్వీనర్లను ఎంపిక చేయాలి. వారు ప్రశ్నపత్రాల తయారీపై దృష్టి పెడతారు. ప్రశ్నల రూపకల్పనకు సంబంధించి నిపుణులను పిలిపిస్తారు. కంప్యూటర్ బేస్డ్‌గా దాదాపు పది రకాల ప్రశ్నపత్రాలను రూపొందిస్తారు. ఇందులో కఠినమైనవి, తేలికైనవి అత్యంత గోప్యంగా తయారు చేయాలి. తర్వాత వాటన్నింటినీ కలిపి కంప్యూటర్ సాయంతో ఫైనల్ పేపర్‌ను సిద్ధం చేస్తారు. ఈ ప్రక్రియ కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తారు. తర్వాత పరీక్ష కేంద్రాల ఎంపిక, ప్రశ్నపత్రాల సగటు పరిశీలన ఉంటాయి. పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి, ర్యాంకుల క్రోడీకరణకు ఎక్కువ సమయం పడుతుంది. పలు దఫాలుగా వీసీలు, ప్రొఫెసర్లు సమావేశాలు జరుపుతూ ఉంటే.. ఇవన్నీ సాఫీగా సాగుతాయి. ఈసారి ఇప్పటికీ విద్యా మండలి సమావేశమే జరగలేదు. ఆలస్యంగా ప్రక్రియ మొదలుపెట్టి హడావుడిగా చేస్తే.. ఎక్కడైనా లోపం జరిగితే.. లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

విద్యార్థుల సన్నద్ధతకూ ఇబ్బంది

ఎంసెట్ ఆలస్యం వల్ల విద్యార్థుల సన్నద్ధతకు, జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు ఇబ్బంది రావొచ్చని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంసెట్ రాసే విద్యార్థుల్లో చాలా వరకు జేఈఈ మెయిన్స్‌కు కూడా సిద్ధమవుతారు. మెయిన్స్ రెండో దశ ఏప్రిల్‌లో జరుగుతుంది. అది పూర్తయ్యాక మేలో ఎంసెట్ రాస్తుంటారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఎంసెట్ కోసం ప్రత్యేక కోచింగ్ తీసుకుంటారు. ఎంసెట్ ఆలస్యమైతే ఇబ్బందులు వస్తాయని, కోచింగ్ కేంద్రాల వారు అదనపు ఫీజులు వసూలు చేస్తారని విద్యార్థులు వాపోతున్నారు. ఎన్ఐటీల్లో సీట్ల కౌన్సెలింగ్ నాటికి ఎంసెట్ కౌన్సెలింగ్ మొదలవకపోతే.. కోరుకున్న కాలేజీలో సీట్లు వస్తాయా? రావా? అన్న ఆందోళన కూడా ఉంటుందని పేర్కొంటున్నారు.

ఉన్నత విద్యా మండలిలో గందరగోళం!

రాష్ట్రంలో ఉమ్మడి ప్రవేశపరీక్షలకు సంబంధించి డిసెంబర్‌లోనే యూనివర్సిటీల వీసీలతో ఉన్నత విద్యా మండలి అధికారులు సమావేశం కావాలని నిర్ణయించారు. తేదీ కూడా ఖరారు చేశారు. సెట్ కన్వీనర్ల ఎంపికకూ రంగం సిద్ధమైంది. ఈలోగా కొత్త ప్రభుత్వం మండలి చైర్మన్‌తోపాటు, వైస్ చైర్మన్‌ను తొలగిస్తున్నట్టు ప్రకటించడంతో.. వీసీలతో సమావేశం వాయిదా పడింది. అయితే ప్రభుత్వం కొత్తవారిని నియమించలేదు. తొలగిస్తున్నట్టు ప్రకటించిన చైర్మన్, వైస్ చైర్మన్ ఇంకా అదే స్థానాల్లో కొనసాగుతున్నారు. ఉన్నత విద్యకు సంబంధించి సీఎం సమీక్షల్లో సరైన సమాచారం ఇవ్వడానికి మండలిలో ఎవరూ లేకపోవడంతో.. వారిని కొనసాగిస్తున్నట్టు ఉన్నతాధికారులు చెప్తున్నారు. వీరినే తిరిగి నియమించే అవకాశం ఉందనీ అంటున్నారు.

సమావేశాలకు వీసీల విముఖత

ఉన్నత విద్యా మండలి చైర్మన్, వైస్ చైర్మన్లను తొలగించిన నేపథ్యంలో.. అధికారికంగా సమావేశాలు నిర్వహించేందుకు వీలుకావడం లేదని మండలి వర్గాలు చెప్తున్నాయి. దీనికి తోడు ఉమ్మడి ప్రవేశపరీక్షలపై చర్చించేందుకు వెళ్లడానికి వర్సిటీల వీసీలూ సుముఖత వ్యక్తం చేయడం లేదని అంటున్నాయి. సెట్స్ కోసం కన్వీనర్లను సూచించాలని మండలి నుంచి లేఖలు వచ్చినా.. యూనివర్సిటీల వీసీలు నిర్లిప్తంగా ఉంటున్నారు. "ముందు చైర్మన్, వైస్ చైర్మన్లను కొనసాగిస్తారా? కొత్తవారిని తెస్తారా? అనే దానిపై స్పష్టత రావాల్సిన అవసరం ఉంది. ఇప్పుడు మేం సెట్స్ కన్వీనర్ల పేర్లు ఇచ్చినా.. కొత్త చైర్మన్ వస్తే మార్పులు ఉంటాయి.." అని ఓ వర్సిటీ వీసీ అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఆదరణ పెరుగుతున్నా..!

కొన్నేళ్లుగా ఎంసెట్ రాసే వారి సంఖ్య పెరుగుతోంది. రాష్ట్రస్థాయిలో సీట్లు ఎక్కువగా ఉండటం, ఉపాధి కోసం, విదేశాల్లో ఉన్నత విద్య కోసం వెళ్లడానికి అవకాశం ఉండటంతో చాలా మంది ఇంజనీరింగ్‌లో చేరుతున్నారు. 2018లో 2.20 లక్షల మంది ఎంసెట్ రాస్తే.. 2023 నాటికి ఈ సంఖ్య 3 లక్షలు దాటింది. పరీక్ష రాసేవారి సంఖ్య ఏటా 20శాతం దాకా పెరుగుతోంది. నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశానికి కూడా ఎంసెట్ (మెడికల్ అండ్ అగ్రికల్చర్) తప్పనిసరి చేయడంతోనూ అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది.

ఎంసెట్‌కు హాజరవుతున్న విద్యార్థుల సంఖ్య ఇదీ..

ఏడాది	ఇంజనీరింగ్	అగ్రికల్చర్
2018	1,47,912	73,078
2019	1,42,218	74,981
2020	1,43,326	78,981
2021	1,64,963	86,641
2022	1,61,552	88,156
2023	1,95,275	1,06,514

బెజవాడ నడిబొడ్డున.. 'సోషల్ జస్టిస్ స్ఫూర్తిప్రదాత' కాదు — 'సోషల్ జస్టిస్ స్ఫూర్తికుడు'



సాక్షి, అమరావతి: బెజవాడ పేరు చెబితే అందరికీ గుర్తొచ్చేది కొండపై కొలువైన దుర్గమ్మ. అదే బెజవాడకు మరో ప్రత్యేక మణిహారంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కరుడు నిలవనున్నారు. నగరం నడిబొడ్డున గొప్ప చారిత్రక ప్రాధాన్యాన్ని సంతరించుకున్న స్వరాజ్ మైదానంలో రూపుదిద్దుకున్న బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహం, స్మృతివనం దేశంలోనే ప్రత్యేక గుర్తింపును తీసుకురానుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహోన్నత సంకల్పంతో నిర్మించిన 'సామాజిక న్యాయ మహా శిల్పం' దర్శనీయ ప్రాంతంగా మారనుంది. విజయవాడలో నిర్మించింది అంబేడ్కర్ స్మృతివనం మాత్రమే కాదు.. భావితరాలకు అంబేడ్కర్ ఆదర్శాలు, ఆలోచనలను అందించే గొప్ప ప్రయత్నం కూడా. దానికి సంబంధించిన మరికొన్ని విశేషాలు..

- స్వరాజ్ మైదానంలో 81 అడుగుల పెడస్టల్‌పై 125 అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటుతో మొత్తం 206 అడుగుల ఎత్తు వస్తుంది. ఇది దేశంలోనే అతి పెద్ద అంబేడ్కర్ విగ్రహంగా రికార్డు సృష్టించింది.
- కాంస్య విగ్రహాన్ని ఢిల్లీలో తయారు చేయించారు. దాన్ని భాగాలుగా విజయవాడకు తరలించి స్మృతివనంలో క్రమ పద్ధతిలో అతికించి అద్భుతంగా తీర్చిదిద్దారు. విగ్రహం తయారీలో షూ దగ్గర్నుంచి బెల్ట్ వరకు హనుమాన్ జంక్షన్ వద్ద శిల్పి ప్రసాద్ ఆధ్వర్యంలో కాస్టింగ్ చేశారు.
- ఢిల్లీ నుంచి వచ్చిన డిజైనర్లు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ తుది దశ పనులు చేస్తున్నారు.
- అంబేడ్కర్ విగ్రహం బేస్(పెడస్టల్)లో గ్రౌండ్, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్లున్నాయి.
- గ్రౌండ్ ఫ్లోర్‌లో నాలుగు హాళ్లుండగా.. ఒక్కోటి నాలుగు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటాయి. అందులో ఒకటి సినిమా హాలు, మిగిలిన మూడు హాళ్లలో ఆయన చరిత్రను తెలిపే డిజిటల్ మ్యూజియం ఉంటుంది.
- మొదటి అంతస్తు(ఫస్ట్ ఫ్లోర్)లో 2,250 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన నాలుగు హాళ్లుంటాయి. ఒక హాల్లో.. అంబేడ్కర్‌కు దక్షిణ భారత దేశంతో ఉన్న అనుబంధాన్ని చిత్రాల ద్వారా డిస్‌ప్లే చేస్తారు.
- రెండో అంతస్తు(సెకండ్ ఫ్లోర్) వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణంలో నాలుగు హాళ్లుంటాయి.
- అంబేడ్కర్ స్మృతివనంలో విగ్రహం ఉన్న ప్రాంతానికి ఒక వైపు నుంచి వెళ్లి.. మరో వైపు నుంచి తిరిగి వచ్చేలా విశాలమైన హాలు మాదిరిగా నిర్మాణాలను పూర్తి చేశారు. వాటి గోడలకు అంబేడ్కర్ జీవిత విశేషాలు, ఆయన చరిత్రకు సంబంధించిన ఘట్టాలను ప్రతిబింబించేలా శిల్పాలను అద్దారు.
- లోపలి భాగంలోని హాళ్లలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అంబేడ్కర్ పాల్గొన్న సమావేశాలు, సభలకు సంబంధించిన పాత చిత్రాలను భారీ చిత్రాలుగా డిజిటలైజ్ చేసి డిస్‌ప్లే చేశారు. ఆయన రాసిన కీలకమైన లేఖలు, ఉపన్యాసాలను ఆయా ఘట్టాలకు అనుగుణంగా ఫొటోలతో పాటు డిస్‌ప్లే చేశారు.
- అంబేడ్కర్ ఆశయాలు, ఆదర్శాలు, సందేశాలను సైతం క్లుప్తంగా తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో డిజిటల్ బోర్డులపై డిస్‌ప్లే చేశారు. 'చదువు.. సమీకరించు.. బోధించు' వంటి ప్రధానమైన సందేశాలను ప్రముఖంగా ఏర్పాటు చేశారు.
- స్మృతివనం ఆవరణను పచ్చని తివాచీ పరిచినట్టు గరిక, మొక్కలతో అందంగా తీర్చిదిద్దారు. అంబేడ్కర్ విగ్రహానికి ముందు ఏర్పాటు చేసిన నెమళ్ల ప్రతిరూపాలు ఆకట్టుకుంటున్నాయి.
- మ్యూజిక్‌కు అనుగుణంగా ప్రవహించే వాటర్ ఫౌంటెయిన్‌లను ఏర్పాటు చేశారు. పెడస్టల్ చుట్టూ ఉన్న ప్రాంతంలో వాటర్ కొలను మాదిరిగా ఫౌంటెయిన్‌ను ఏర్పాటు చేశారు. ఇంకా మరెన్నో ప్రత్యేకతలు అంబేడ్కర్ స్మృతివనంలో దర్శనం ఇవ్వనున్నాయి

బీజేపీ నుంచి సతీష్‌మాదిగ సస్పెండ్



సతీష్‌మాదిగ

అచ్చంపేట రూరల్: పార్టీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున బీజేపీ నుంచి సతీష్ మాదిగను సస్పెండ్ చేస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవర్తనపై వారం రోజుల్లో రాష్ట్ర పార్టీకి వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అచ్చంపేట బీజేపీ అభ్యర్థిగా సతీష్‌మాదిగ పోటీ చేయగా 4,267 ఓట్లు వచ్చాయి. 2022, మే 5న బీజేపీలో చేరి రాష్ట్ర కార్యవర్గసభ్యుడిగా కొనసాగుతున్నారు. 2002–2009 వరకు టీఆర్ఎస్ ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా, 2006లో టీఆర్ఎస్ నుంచి బిజినేపల్లి జెడ్పీటీసీగా, 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి నాగర్‌కర్నూల్ ఎంపీగా పోటీ చేశారు. 2009 నుంచి 2017 వరకు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా పని చేసిన ఆయన 2017లో రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. రేవంత్‌రెడ్డి సన్నిహితుడిగానే చాలారోజులు కొనసాగారు. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ ఎంపీగా పోటీ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ పార్టీ సస్పెండ్ చేయడంతో ఆశలు సన్నగిల్లినట్లే అనిపిస్తోంది.

అనుమతి లేని వెంచర్ రాళ్లు తొలగింపు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రగుట్ట వద్ద అనుమతులు లేకుండా వెలసిన వెంచర్ రాళ్లను బుధవారం మున్సిపల్ కమిషనర్ మహమూద్‌షేక్ తొలగించారు. డోజర్ సాయంతో వెంచర్‌లోని రాళ్లను పూర్తిగా తీసివేయించారు. అనుమతులు లేకుండా వెంచర్లు చేస్తే అందులో ప్లాట్లు కొనుగోలు చేసి ఇబ్బందుల పాలుకారాదని ఆయన ప్రజలకు సూచించారు. ప్లాట్లు కొనే ముందు అన్ని పత్రాలు సరిచూసుకోవాలని సూచించారు.



రాళ్లను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

ఆర్థికాభివృద్ధే ప్రధాని లక్ష్యం

- కేంద్ర ఆరోగ్యశాఖ సంయుక్త కార్యదర్శి రఘువంశి



చెర్కూరులో మాట్లాడుతున్న కేంద్ర ఆరోగ్యశాఖ సంయుక్త కార్యదర్శి రఘువంశి

వెల్దండ: గ్రామీణ ప్రజలు కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని కేంద్ర ఆరోగ్యశాఖ సంయుక్త కార్యదర్శి రఘువంశి తెలిపారు. వికసిత భారత్ సంకల్పయాత్రలో భాగంగా బుధవారం మండలంలోని చెర్కూరు, బర్కత్‌పల్లిలో నిర్వహించిన గ్రామసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. 2047 నాటికి భారత్ ఒక మహా శక్తివంతమైన దేశంగా నిలవాలన్న లక్ష్యంతో ప్రధాని పని చేస్తున్నారన్నారు. గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించే దిశగా ప్రభుత్వ యంత్రాంగం కృషి చేయాలన్నారు. పీఎం ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ఎంతో ఉపయోగం ఉందని తెలిపారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులందరికీ కేంద్ర పథకాలు అందాలని, వాటి రాయితీలను వివరించారు. అనంతరం ప్రధాని సందేశాన్ని వినిపించి ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య సహాయ కార్యదర్శి ప్రతిబాల, డీఆర్డీఓ నర్సింగ్‌రావు, డీఎంహెచ్ఓ డా. సుధాకర్‌లాల్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, వెంకటరమణ, సర్పంచులు రేవతి, బీరయ్య, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏఓ మంజుల, ఏపీఎం రాములు, బ్యాంకు మేనేజర్ రాములు, డా. స్వరూప, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

తగ్గుతున్న ఉల్లి ధర



దేవరకద్ర మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉల్లి బస్తాలు

- గరిష్టంగా రూ.1,800, కనిష్టంగా రూ.1,500

దేవరకద్ర: ఉల్లి సీజన్ ప్రారంభమైన తర్వాత ధరలు క్రమంగా తగ్గుతున్నాయి. గత వారం ఉన్న ధర ఈసారి మరింత తగ్గింది. బుధవారం దేవరకద్ర మార్కెట్‌కు వివిధ గ్రామాల నుంచి రైతులు ఉల్లిని అమ్మకానికి తెచ్చారు. అయితే సంక్రాంతి పండుగ వాతావరణం ఇంకా వీడకపోవడం వల్ల ఉల్లి తక్కువ మొత్తంలో వచ్చింది. వచ్చిన ఉల్లిని వ్యాపారులు వేలం ద్వారా కొనుగోలు చేశారు. నాణ్యతగా ఉన్న ఉల్లి ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.1,800, కనిష్టంగా రూ.1,500 వరకు పలికింది. చిన్నగా పేడు ఉల్లికి రూ.800 వరకు ధర వచ్చింది. మార్కెట్‌లో కొనుగోలు చేసిన ఉల్లిని 45 కిలోల బస్తాలుగా తూకం వేసి గరిష్టంగా రూ.900, కనిష్టంగా రూ. 750 వరకు వినియోగదారులకు విక్రయించారు.

కందుల ధర రూ.8,700

దేవరకద్ర మార్కెట్‌లో బుధవారం జరిగిన టెండర్లలో కందుల ధర క్వింటాల్‌కు సరాసరిగా రూ.8,700 వరకు లభించింది. లావాదేవీలు కూడా తక్కువ మొత్తంలో జరిగాయి.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో బుధవారం 1,020 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా వచ్చే నీటిని సమాంతర కాల్వ ద్వారా నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

మార్కెట్‌లోకి క్రెటా కొత్త మాడల్ ఆవిష్కరణ

పాలమూరు: హ్యుందాయ్ కంపెనీ నుంచి మార్కెట్‌లోకి కొత్తగా వచ్చిన మిడ్ సైజ్ ఎస్‌యూవీ క్రెటాను జిల్లాకేంద్రంలోని ట్రెండ్ హ్యుందాయ్ షోరూంలో గురువారం ఎంవీఐ నరేష్, షోరూం ఎండీ గట్టు గోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎండీ గట్టు గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది అమ్మకాల్లో 65 శాతం ఎస్‌యూవీలే ఉంటాయని భావిస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు 2030 నాటికి మొత్తం విక్రయాల్లో విద్యుత్ కార్ల వాటా 20శాతం సాధించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన కారు ధర రూ.10.99లక్షల నుంచి రూ.19.99 లక్షల వరకు ఎక్స్‌షోరూం ధరలకు లభిస్తున్నాయని, లెవెల్ 2ఏడీఏఎస్ సెప్టీ సూట్, 1.5లీటర్ టర్బోజీడీఐ ఇంజన్‌తో వస్తున్న కొత్త క్రెటా ఏడు వేరియంట్‌లలో లభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు గట్టు సిరి చందనరెడ్డి, గట్టు శ్రీ హర్షిత్‌రెడ్డి, మేనేజర్ శివకుమార్, సెల్స్ మేనేజర్ వర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



నూతన మోడల్ కారును ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఉమామహేశ్వరంలో భక్తుల రద్దీ



ఉమామహేశ్వరంలో ఉత్సవ మూర్తుల వద్ద పూజలు చేస్తున్న అర్చకులు





ప్రత్యేక అలంకరణలో ఉమా మహేశ్వరుడు, ఉమాదేవి

అచ్చంపేట: శ్రీశైలం ఉత్తర ద్వారమైన శ్రీ ఉమామహేశ్వర క్షేత్రంలో బుధవారం రెండోరోజు బ్రహ్మోత్సవాలు కొనసాగాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వారితోపాటు శ్రీశైలం దర్శించుకొని తిరుగుప్రయాణమైన భక్తులు పాపనాశిని గుండంలో ఉత్తరాయణ పుణ్యకాల స్నానాలు ఆచరించారు. ఈశ్వరునికి పాలాభిషేకం, పంచామృతాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, గణపతికి ఆలయ అర్చకులు వీరయ్యశాస్త్రి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కందూరు సుధాకర్, కార్య నిర్వహణ కార్యదర్శి శ్రీనివాసరావు పూజలో పాల్గొన్నారు. బుధవారం ఉదయం 9 గంటలకు ప్రాతరౌపాసన, బలిహరణం, నీరాజనం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం 4 గంటలకు సాయమౌపాసన, సభ్యపూజ, బలిహరణం, నీరాజనం, అశ్వవాహన సేవ, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ చేపట్టారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 9 గంటలకు గవ్యాంత పూజలు, అమ్మవారికి అభిషేకం, సహస్రనామార్చన, రుద్రాభిషేకం, రుద్రహోమం, సాయంత్రం 4 గంటలకు సాయమౌపాసన, శ్రీసూక్తి, దుర్గా సూక్త హోమం, శేషవాహన సేవ, పుష్పోత్సవం, నీరాజన మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ ఉంటుంది.

పాడి రైతులను ఆదుకోవాలి : బీజేపీ



మాట్లాడుతున్న శాంతికుమార్

జడ్చర్ల టౌన్: రాష్ట్ర ప్రభుత్వం విజయ డెయిరీకి రూ.100 కోట్లు ఇచ్చి పాడిరైతులను ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ అన్నారు. బుధవారం జడ్చర్లలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయ డెయిరీకి పాలు పోసే రైతులకు రెండు నెలలుగా డబ్బులు చెల్లించడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.80 కోట్ల మేర బకాయిలున్నాయని, ప్రతి 15 రోజులకోమారు డబ్బులు తీసుకునే రైతులు రెండు నెలలుగా అందక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం వైఫల్యం వల్ల విజయ డెయిరీ ఆస్తులు తాకట్టులో ఉన్నాయని, ప్రస్తుత ప్రభుత్వం వాటిపైనా దృష్టిసారించాలని కోరారు.

12 ఎంపీస్థానాలు గెలుస్తాం

పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ 12 స్థానాలు గెలుస్తుందని శాంతికుమార్ ధీమా వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ సీటు తనకే దక్కుతుందన్నారు. ఈ స్థానంలో 65 శాతం బీసీ ఓటర్లు ఉన్నారని అందుకే రాష్ట్ర, కేంద్ర నాయకత్వం తనకు టికెట్ ఇస్తుందన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ కోసం ఎమ్మెల్యే టికెట్‌ను కాదనుకున్న డీకే అరుణ ఇప్పుడు అదే బీసీ కోసం సీటు వద్దనుకుంటుందని చెప్పారు. సమావేశంలో నాయకులు కృష్ణయ్య, నాగరాజు, ప్రతాప్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.